మా బావమరిది మా ఇంటికొచ్చాడు. ఆడు వచ్చిన రోజున నా ఆటోకి ఏక్సిడెంట్ అయింది. ఆ చికాకులో నా పెళ్లాం ఏమన్నా విసుక్కున్నాను. ఆడు ఉన్న రెండురోజులు ఏక్సిడెంట్ గొడవల్లో మా బావమరిదితో సరిగ్గా మాట్లాడలేదు. ఆడు వెళ్లిన మరుసటి రోజు మా అన్నకు గవర్నమెంటు ఉద్యోగం. ఆడు గొప్పోడు అని నీకు కుళ్లు అంటూ మొదలుపెట్టింది. నేనూ ఊరుకోలేదు. అలా మొదలైన మా గొడవ మా వాళ్లకు నువ్వు మర్యాద ఇయ్యలేదు. నేను ఎందుకు ఇవ్వాలి అంటూ ఆటో వెనకాల పేర్లు మార్చే వరకూ అది కుదుటపడలేదు. నన్ను పడనివ్వలేదు.''

ఈసారి మా వారు అన్నారు ''మరి ఏక్సిడెంట్ విషయం చెప్పలేదా'' అని.

''చెప్పానండి. దాని కోపం తగ్గల్లేదు'' అని అతను అంటూ ఉండగానే మా ఇల్లు వచ్చింది. అతను డబ్బులు తీసుకొంటూ ఉండగానే మొత్తానికి 'తల్లిదండ్రుల ప్రేమతో' అని ఆటో వెనకాల రాతని- అని నేను అంటూ ఉండగానే కళ్లల్లో నీళ్లతో అతను వెళ్లిపోయాడు.

ఇది జరిగిన కొన్ని రోజులకి మా మనవరాలు పుట్టిన రోజుకి విశాఖ వెళ్లి జన్మభూమికి తిరిగి రాజమండ్రి చేరుకున్నాం నేను ఈయన! ఉదయం పది గంటలకే ఎండ మండిపోతోంది ''బాగున్నారా సార్, మేడమ్ మీరూ చిక్కారు ఏమిటి'' అంటూ హుషారుగా మా వారి చేతిలోని సూట్‌కేస్ తీసుకొంటున్న అతన్ని చూసి మేము ఈసారి ఈజీగానే గుర్తుపట్టాము. సుబ్రహ్మణ్యేశ్వర గుడి దగ్గర పరిచయమైన ఆ ఆటో డ్రైవర్ చాలా హుషారుగా, ఇదివరకటి కంటే ఆరోగ్యంగా ఉన్నాడు. చాలా హుషారుగా అతనే మాటలాడడం మొదలు పెట్టాడు.

''ఒకరోజు మా ఆవిడతో అన్నాను. ఏంటోనే మన ఇద్దరి పేర్లమీద ఆటో నడుపుతూ ఉంటే అట్టే బేరాలు రావట్లేదు. ఆ ఏడుకొండలాడి పేరు పెడతామేంటి అని, మా ఆవిడ 'ఊ' అనగానే ఆటో వెనకాల పేర్లు మార్చేశాను. మా అమ్మ పేరు మంగమ్మ. మా నాన్న పేరు వెంకన్న సార్. ఏ పేర్లతో పిలుచుకున్నా వాళ్లు మనకు దేవతలే కదా సార్''.

ఇల్లు రాగానే ఆటో దిగబోతూ కుతూహలంగా ఆటో వెనకాతలకెళ్లి పేర్లు చదివాము. ''శ్రీనివాస్ - పద్మావతి''. ఆటోకి డబ్బులిస్తూ ఆశీర్వచనంలా అతని భుజం తట్టారు మా వారు.

**-కె. రత్నమాల (రాజమండ్రి)**

# అర్థాలే వేరులే

**అది ఒక ప్రభుత్వ కార్యాలయం.**

''ఏమోయ్ రికార్డ్‌లో ఒక ముఖ్యమైన ఫైలు కావాలి. రికార్డ్ రూమ్‌కి వెళ్లి 211/93 పాత ఫైలు వెతికి పట్టుకురా'' అన్నారు ఆఫీసరుగారు రికార్డ్ అసిస్టెంటు సుబ్బారావుతో. ఆ ఆఫీసులో ఇంకా కంప్యూటర్స్ రాలేదు.

సుబ్బారావు అదోలా ముఖం పెట్టి ''ఎక్స్క్యూజ్ మీ సర్. నాకు రికార్డ్ రూమ్‌కి వెళ్తే ఆ దుమ్ముకి ఎలర్జీ అండీ. ఒకటే తుమ్ములు వచ్చేస్తాయి. ఇంకెవరికైనా చెప్పండి'' అన్నాడు.

మనం ఎవరికైనా పని చెప్తే వాళ్లు అడ్డం తిరిగి మాట్లాడితే ఒకే కోపం వస్తుంది.

''అదేంటయ్యా ఎప్పుడు రికార్డ్‌రూమ్‌లోకి వెళ్లమన్నా ఎలర్జీ అంటావ్. నీకు ఇష్టం లేకపోతే ఆ పని చెయ్యను అని చెప్పు. అంతేగాని ఏదో సాకు చెప్పొద్దు. అయినా నీకు బద్ధకం ఎక్కువై పోయిందీ మధ్యన'' అన్నాడాయన.

''అదికాదు సర్. ఈ విషయం మీకు ఎన్నో సార్లు చెప్పాను.'' ఆయన అతని మాటలకు అడ్డు వచ్చి ''నో మోర్ ఆర్గ్యుమెంట్స్'' అంటూ ఇంకొకతనికి ఆ పని చెప్పాను.

''క్షణంలో వచ్చేస్తాయండీ ఆ ఫైల్సన్నీ. రికార్డ్‌లో వెదికిస్తున్నాను.'' అని ఆఫీసరుగారు అన్నారో లేదో బాస్ ఫైరయిపోయి ''చాల్లెండి...పదండి'' అంటూ రికార్డ్ రూమ్‌లోకి చకచకా వెళ్తుంటే ఆయన్ను అనుసరించారు ఆఫీసరుగారు.

రికార్డ్ రూమ్ ఫైల్సన్నీ వెదుకుతున్నారు



సిబ్బంది. అక్కడ దుమ్ము లేస్తోంది.

అంతే బాస్‌కి తుమ్ములు మొదలయ్యాయి. ఒకటి, మూడు, తొమ్మిది అలా తుమ్ముతూనే ఉన్నారాయన. ''పదండి సర్ మనవాళ్లు ఫైల్స్ తెస్తారు'' అంటూ తుమ్ముతున్న బాస్‌ను ఆఫీసరుగారు తన గదిలోకి తీసుకు వెళ్లి కూర్చోపెట్టారు. బాస్ ముఖం ఎర్రగా కందిపోయింది. ఆయన ముక్కు దొండపండులా అయిపోయింది.

''నాకు అసలే డస్ట్ ఎలర్జీ. ఏవిల్ టాబ్లెట్స్ తెప్పించండి ఎవరి చేతనైనా. ఆ ఫైల్స్ దులిపించండి బాగా. నేను గెస్ట్‌హౌస్‌కి వెళ్తాను. డిస్కషన్స్ మధ్యాహ్నం పెట్టుకుందాం'' అని అంటూండగానే బాస్ వెళ్లిపోయాడు.

''అయ్యో మీరు ఎందుకు వెళ్లారు సర్ అలర్జీ ఉన్నప్పుడు. జాగ్రత్తగా ఉండాలి కదా'' అంటున్నారు ఆఫీసరుగారు ఆయనతో కారు దాకా వెళ్తూ.

ఆఫీసరుగారి వెనకాలే ఉన్న రికార్డ్ అసిస్టెంట్ సుబ్బారావు ''రికార్డ్ రూమ్‌లోకి వెళ్తే తుమ్ములొస్తాయంటే ఆఫీసర్‌కైతే డస్ట్ ఎలర్జీ, గుమాస్తాకైతే బద్ధకం అని అర్థం అన్నమాట'' అనుకుంటూ ముక్కుకు జేబురుమాలు అడ్డం పెట్టుకున్నాడు ఆ తుమ్ములు తనకు అంటుకోకుండా.

**-కె.బి. కృష్ణ (కాకినాడ)**